డాక్టర్ కావాలన్న ఆమె ఆశయం ఎలా నెరవేరింది?

ఎ. మురళీకృష్ణ

కథ

# మోడల్

ప్రతిభ ఏడుస్తోంది...

అసమాన ప్రతిభావంతురాలు ప్రతిభ. ఆ ఏడాది జరిగిన 'ఎమ్సెట్' పరీక్షలో రాష్ట్రం మొత్తానికే మొదటి ర్యాంక్ సాధించిన ప్రతిభ ఒంటరిగా కూర్చుని ఏడుస్తోంది.

ఆమె చుట్టూ గుట్టలాగా న్యూస్ పేపర్లు—

ప్రతి పేపర్‌లోనూ ఫ్రంట్ పేజీలో మొదటి పది ర్యాంక్‌లు సాధించిన [illegible] మెడికల్ గ్రూప్‌కి [illegible]

తన ఫొటోలతోపాటూ, అంతకు ముందు రోజు జర్నలిస్టులు తనతో తీసుకున్న ఇంటర్వ్యూలు కూడా వేశారు.

'డాక్టరు కావాలన్నది నా ఆశయం'

'డాక్టరునై పేద ప్రజలకి సహాయం చేస్తా'

'ఇది నా రెండేళ్ళ కృషి ఫలితం'

—ఇలా సాగిపోయాయి హెడ్‌లైన్స్!

'ఎమ్సెట్'లో తనకి ఫస్ట్‌ర్యాంక్ వచ్చిందని తెలిగానే మొదట ఆనందంతో పొంగిపోయింది ప్రతిభ.

తన ఆశయం నెరవేర్చుకోడానికి మొదటి మెట్టు ఎక్కబోతున్నానని మురిసిపోయింది. డాక్టరు కావాలనేది తన జీవితాశయం— కడుపునిండా తినకపోయినా ఫర్వాలేదు— మంచి బట్టలు కట్టుకోకపోయినా ఫర్వాలేదు — కష్టపడి చదూకోవాలి! తన జీవితాశయం నెరవేర్చుకోవాలి అనే పట్టుదలతో, దీక్షతో, అభిరామకృషితో ఒక అసిధారవ్రతంలా సాగిన తన సొంత ప్రిపరేషన్‌వలన, స్వయంశక్తి



తో— తను ఫస్ట్ ర్యాంక్ సాధించగలిగింది!

తన విజయోత్సాహాన్ని దగ్గిర వాళ్ళెవరితోనైనా పంచుకోవాలనుకుంది ప్రతిభ తనకి ఆ వార్త తెలీగానే.

ఆమెకి మొదట గుర్తుకు వచ్చింది తనకిఉన్న ఒకే ఒక్క స్నేహితురాలు— షాలిని. షాలినిని తప్పుకున్న తర్వాత ఇంక ఒక్క క్షణంకూడా ప్రతిభకి

కార్చిల్వలేదు—

ఇంటికి తాళం పెట్టి షాలిని వాళ్ళింటికి పరిగెత్తింది.

ఆత్రంగా షాలిని ఇంటికి వెళ్ళిన ప్రతిభకి నిరాశే ఎదురయ్యింది— షాలిని ఇంట్లో లేదు!

ప్రతిభకి నిస్సత్తువ ఆవరించింది— కావాలనుకున్నప్పుడే నా అనుకున్నవాళ్ళు మరీ దూరమై పోతుంటారు— ఇప్పుడు ఈ ఆనందం తను ఇంకెవ్వరితో పంచుకోగలదు

హఠాత్తుగా ఆమెకి గుర్తుకు వచ్చాడు ఒక వ్యక్తి— రాజా హరిశ్చంద్రప్రసాద్!

అతి ముఖ్యమైన వ్యక్తిని తనెలా మర్చిపోగలిగింది?

హరిశ్చంద్రప్రసాద్ ఇంటర్‌లో ప్రతిభ చదివిన కాలేజీకి డోనర్. ఒకసారి కాలేజ్ ఫంక్షన్‌లో ప్రతిభ ప్రతిభాకౌశలాలు విని ఆమె ఆర్థిక స్థితిగతులు తెల్సుకుని, ఆమె సీట్ సంపాదిస్తే తప్పక ఆమెని తన స్వంత ఖర్చుమీద మెడిసిన్ చదివిస్తానని సభాముఖంగా వాగ్దానం చేశాడు.

ఆయనచేసిన ఆ వాగ్దానం వలన ప్రతిభకి క్రొత్త ఆశలు చిగురించాయి.

తను సీట్ సంపాదిస్తుంది డెఫినెట్‌గా!

కానీ, ఆ చదువుకయ్యే ఖర్చు మాటు?— ఇన్నాళ్ళూ దాని గురించి ఆయిన వర్రీ అంతా హరిశ్చంద్రప్రసాద్ వాగ్దానంతో తీరిపోయింది ప్రతిభకి. ఆ రోజు ఫంక్షన్ అయ్యాక హరిశ్చంద్రప్రసాద్‌ని కల్సుకుని కృతజ్ఞతలు చెప్పుకుంది

ఆయన ప్రతిభని అభినందించి, పట్టుదలగా చదివి మంచి ర్యాంక్ సంపాదించమని చెప్పాడు.

ఇప్పుడు—

తనే— ఈసారి ఎమ్‌సెట్‌లో ఫస్ట్‌ర్యాంక్ సాధించిందని తెలిస్తే ఆయనెలా ఫీలౌతారు?

ఇప్పుడు తను తప్పనిసరిగా కల్సుకోవాల్సిన వ్యక్తి హరిశ్చంద్రప్రసాద్!

షాలిని ఇంటినుంచి డైరెక్ట్‌గా హరిశ్చంద్రప్రసాద్‌ని కల్సుకోడానికి ఆయన బంగ్లాకి వెళ్ళింది ప్రతిభ!

అక్కడ గేట్ దగ్గర గూర్ఖాని తప్పించుకుని లోనికి వెళ్ళేసరికి తల ప్రాణం తోక్కొచ్చిందామెకి.

లోపలికెళ్ళి దాదాపు ఒక అరగంట వెయిట్ చేశాక అప్పుడు లోపలినుండి బయటికి వచ్చిందొకావిడ. ఆవిడ హరిశ్చంద్రప్రసాద్‌గారి తల్లి అని తెలియడంతో—

'నమస్కారమండీ!' అంది ప్రతిభ వినయంగా.

తను వచ్చిన పని— హరిశ్చంద్రప్రసాద్‌ని కల్సుకోవాలనుకుంటున్న సంగతి చెప్పింది ఆవిడకి ప్రతిభ. అంతా విని ఆవిడ చెప్పిన మాట విన్నాక అది అశనిపాతంలా తాకింది ప్రతిభని.

'రాజా హరిశ్చంద్రప్రసాద్ బిజినెస్ పనిమీద అమెరికా వెళ్ళారు!'

దురదృష్టం తనని అన్నివైపుల నుంచి వెంటాడుతోందా అనిపించింది ప్రతిభకి.

ఎంతలేదన్నా ఆయన తిరిగి రావడానికి రెండునెలలు పడుతుంది కానీ కాలేజీలో చేరడానికి అంత టైం లేదు

అదేవిషయం చెప్పింది ప్రతిభ ఆవిడతో

'మాడమ్మా... రాజా నీ చదువుకి సహాయం చేస్తానని వాగ్దానం చేసినమాట నాకు తెలియదు— అటువంటి వ్యవహారాలన్నీ అకౌంటెంట్‌గారు చూసుకుంటారు— ఆయన్ని కల్సుకో'మనిచెప్పి నిర్లక్ష్యంగా లోనికి వెళ్ళిపోయింది ఆవిడ.

అకౌంటెంట్ దగ్గరకి వెళ్ళింది ప్రతిభ

—

'రాజాగారూర్లో లేనప్పుడు ఏ లావాదేవీ అయినా అమ్మగారి అనుమతి లేనిదే జరుగవ న్నాడు అకౌంటెంట్!

ప్రతిభకి అర్థం అయింది— హరిశ్చంద్ర ప్రసాద్ తిరిగివచ్చే వరకూ ఆ ఇంటినుంచి తనకేం సహాయం లభించదు— నీరసంగా ఇంటికి కదిలిందామె.

సాయంత్రం ఇంటి దగ్గర జర్నలిస్టులు చుట్టు ముట్టేసారామెని అభినందనల్తో—

ప్రశ్నలమీద ప్రశ్నలు

వాళ్ళెవరికీ తన మానసిక పరిస్థితులు అవసరం లేదు—

రేపటిరోజున తను ఒక 'టాక్ ఆఫ్ ది టౌన్' అవుతుంది— తన గురించి ఎంత ఎక్కువ న్యూస్ కవర్ చేస్తే ఆ పేపర్ వాళ్ళకంత గొప్ప—

తనకెవ్వరూ లేరన్న విషయం విని అందరూ ఆశ్చర్యపోయారు—

డాక్టరు కావటం తన జీవితాశయం అని చెప్పింది.


తన తల్లీ తండ్రీ చిన్నప్పుడే పోయారు సరయిన వైద్య సదుపాయం అందక

చిన్ననాటి ఆ సంఘటన తన మనసుపై ప్రభావం చూపించడంతో తను డాక్టరై ప్రజలకి సేవ చేయాలనుకున్నాని మనసులో మాట చెప్పింది—

'మరి మీరు ఇప్పటి వరకూ ఎవరి దగ్గర పెరిగారు?' ఆసక్తిగా అడిగారు.

'మా బామ్మగారి దగ్గర— ఆవిడకూడా మొన్నే పోయారు!' బాధగా చెప్పింది ప్రతిభ.

''ఆవిడకూడా సరైన వైద్య సదుపాయం



అందకనే పోయారా?'' అడిగాడో క్రూర జర్నలిస్టు.

అంత బాధలోనూ నవ్వొచ్చింది ప్రతిభకి ఆ ప్రశ్నవిని— పేపర్లలో పుకార్లు ఎలా పుట్టాయో అర్థమయి!

'లేదు' చెప్పింది.

రాత్రయ్యేసరికి జర్నలిస్టుల హడావిడి తగ్గింది.

బెంగతో ప్రతిభకి ఆ రోజు రాత్రి నిద్రపట్టలేదు— భవిష్యత్తంతా అగమ్యగోచరంగా ఉంది.

ఇన్నాళ్ళూ కష్టపడి ర్యాంక్ సంపాదించి ఇప్పుడు కాలేజీలో చేరకపోతే తను పడిన శ్రమంతా వృథా.

ఎలాగయినా కాలేజ్‌లో చేరాలి— కాలేజ్‌లో చేరాలంటే డబ్బు కావాలి—

ఎలా డబ్బు సంపాదించడం!

అమ్మేద్దామంటే ఇంట్లో పెద్దగా ఖరీదయిన సామాన్లేం లేవు—

అర్ధరూపాయి మీదపెట్టి అమ్మితే పావలాక్కూడా అమ్ముడుపోని సామాన్లు—

ఇల్లంతా ఊడ్చిపెట్టేసి, ఆఖరికి ఆ రోజు ఉదయం పేపర్లవాళ్ళు పంపిన కాంప్లిమెంటరీ కాపీలనుకూడా సాయంత్రం సగం రేటుకి అమ్మేసినాకూడా ఇంటర్వ్యూకి హైదరాబాద్ వెళ్ళి రావడానికి, కాలేజీలో జాయినింగ్ ఫీజు కట్టడానికి డబ్బులు సరిపోవు—

అందుకే—

ఉదయంనుంచీ అలా ఏడుస్తూ కూర్చుంది ప్రతిభ- ఏడ్చి, ఏడ్చి కళ్ళలోకూడా నీరింకిపోయిందేమో! ఆమెకి కన్నీళ్ళుకూడా రావడంలేదు.

సరిగ్గా అప్పుడే ఇంట్లోకి అడుగుపెట్టింది షాలిని!

'కంగ్రాచ్యులేషన్స్ ప్రతిభా'అంటూ— శోకముద్రలా కూర్చునిఉన్న ప్రతిభని చూస్తూ 'ఏమిటిదీ? ఏడుస్తున్నావా! నిజంగా ఏడుపేనా లేక ఆనందభాష్పాలా?' అనడిగింది అనుమానంగా—

'కాదు— ఏడుపే' ప్రతిభ చెప్పిన సమాధానంవిని నవ్వొచ్చింది షాలినికి—

ప్రతిభ ప్రక్కనే కూర్చుంటూ అడిగింది షాలిని లాలనగా— 'పిచ్చి మొహమా! ఎందుకే ఏడుస్తున్నావ్' అని. ఆ మాత్రం కన్‌సర్న్‌కే బరెస్ట్ అయిపోయింది ప్రతిభ— వెక్కిళ్ళమధ్య జరిగిందంతా షాలినికి చెప్పింది.

'బాడ్‌లక్' ప్రతిభ చెప్పింది విని అంది షాలిని 'ఇప్పుడెలా?' ఆదుర్దాగా అడిగింది.

'షాలినీ! నిన్నోమాట అడగనా. నాకు, మీ వాళ్ళేమయినా సహాయం చేస్తారంటావా?' ఆశగా అడిగింది ప్రతిభ స్నేహితురాలిని.

షాలిని నవ్వింది— 'నో డవుట్! మా వాళ్ళు నీకు చచ్చినా సాయం చెయ్యరు— ఉత్త సెల్ఫిష్ మనుషులు— నాకు మెడిసన్‌లో ఈ భూప్రపంచమంత పెద్ద రాంక్ వచ్చినా డొనేషన్ కట్టి చదివిస్తారు కానీ— అదే డబ్బుతో మీలాంటి వాళ్ళకి సాయం చెయ్యమంటే చచ్చినా చెయ్యరు— నాకు తెల్సుగా మావాళ్ళ మెంటాలిటీ. కనీసం అప్పుకూడా ఇవ్వరు— అడగటం అనవసరం' తేల్చేసింది షాలిని.

'మరి— ఇప్పుడేంటి చేయడం?' నీరుకా

రిపోతూ అంది ప్రతిభ.

ప్రతిభని అలా చూస్తుంటే షాలినికి జాలేస్తోంది— ఆమెకూడా ఆలోచిస్తోంది— ఆలోచిస్తూ క్రింద పడిఉన్న పేపర్లలోని ప్రతిభ ఇంటర్వ్యూలని చూసి అడిగింది 'ఇదంతా ఎప్పుడు?' అని.

'నిన్న — సాయంత్రం' చెప్పింది ప్రతిభ

ఆ ఇంటర్వ్యూలు చదువుతున్న షాలిని మెదడులో మెరుపులాంటి ఆలోచన మెరిసింది— అంతే షాలిని ఎక్సయిట్‌మెంట్‌తో ఊగిపోయింది—

'ప్రతిభా... మనం డబ్బు సంపాదించేసాం — వారపత్రికలు చదివిన నా పరిజ్ఞానం ఊరికే పోలేదు— లే— లేచి తయారవ్వు— తయారయ్యి వాతోరా!' హడావిడిగా అంది షాలిని.

'ఎక్కడికి?' ఆశ్చర్యంగా అడిగింది ప్రతిభ.

''డబ్బు సంపాదించడానికి' చెప్పింది షాలిని.

ప్రతిభకి అంతా అయోమయంగా ఉంది— అయినా షాలిని సంగతి తెల్సు కనుక గబగబా లేచి తెమిలింది.

ఇద్దరూకల్సి ఇంటికి తాళంపెట్టి బయటకి వచ్చారు.


'ఆటో!' ఆటోని పిల్చింది షాలిని— ఇద్దరూ ఎక్కాక వెళ్ళాల్సిన ప్లేస్ పేరు చెప్పింది. అదివిని ఆశ్చర్యంగా అడిగింది ప్రతిభ' ఇప్పుడెందుకు అక్కడికి?

'చెప్పానుగా— డబ్బు సంపాదించడానికని' నవ్వుతూ అంది షాలిని.

'అబ్బ— ఇంకా చాలుగానీ సస్పెన్సు విప్పెయ్యి!' తనూ నవ్వుతూ అంది ప్రతిభ — ఆమెకి నెమ్మది నెమ్మదిగా షాలిని మీద కాన్ఫిడెన్స్ పెరుగుతోంది.

'ఇప్పుడు నువ్వు మోడలింగ్ చేయబోతున్నావు' చెప్పింది షాలిని.

'మోడలింగా— నేనా!' ఆశ్చర్యంగా అంది ప్రతిభ.



## తేడా

"ఆ ముష్టివాడికి రోజూ అంత అన్నం ఎందుకేస్తున్నావు?" కోపంగా అడిగాడు భర్త.

"పోదురూ... మీరు మరీనూ... మీకు మాత్రం అథిత పెట్టడం లేదా ఏమిటి?" తాపీగా అంది భార్య.

—ఎస్.రాజ్ కుమార్ (సిరిసిల్లా)

'అవును— ఇంత తక్కువ వ్యవధిలో అంత డబ్బు సంపాదించడానికి అదే సులువయిన మార్గం!'

'కానీ మన ముఖానికి మోడలింగ్ ఛాన్సెవరిస్తారిప్పుడూ' సందేహంగా అడిగింది ప్రతిభ.

'మోడలింగ్ చేయాలంటే— ఒకప్పుడు అందం కావాల్సి వచ్చేది! కానీ ఇప్పుడలాకాదు— మోడలింగ్ చేయాలంటే అందమొక్కటే అర్హతకాదు, తెలివితేటలతోనూ, ప్రతిభతోనూ మోడలింగ్ చేయ్యొచ్చు' చెప్పింది షాలిని.

'నువ్వంటూన్నదేమిటో నాకు అర్థం కావటంలేదు' అంది ప్రతిభ.

''హు... నువ్వు సినిమాలు, టీవీ చూడవ్, కనీసం వారపత్రికలేనా చదవవు. అందుకే నీకు ఆ మాత్రం లోకజ్ఞానం కూడా లేదు—

మోడలింగ్ ఈ రోజుల్లో అందమైన వాళ్ళేకాదు— ఏదో రంగంలో ప్రతిభావంతులు, విజయాలు సాధించిన వాళ్ళూ అందరూ చేస్తున్నారు. వాళ్ళవలన ఆయా ప్రొడక్ట్కి జనాల్లో క్రేజ్ పెరుగుతోంది!

పరుగులరాణి ఫలానా సోప్ వాడుతోందని అడ్వర్టైజ్ చేస్తే అందరూ ఆ సోప్కోసం ఎగబడుతున్నారు— ఆ సబ్బు వాడడంవల్లనే తను అంత ఆరోగ్యంగా ఉన్నానంటుందామె ఆ అడ్వర్టైజ్మెంట్లో.

అలాగే క్రికెట్లో సూపర్స్టార్ తను ఫలానా కంపెనీ డ్రస్లనే వాడుతానని చెప్తే ఆ కంపెనీ డ్రస్లకి విపరీతమయిన మార్కెట్ లభిస్తుంది—

ఇప్పుడు నువ్వు చేయబోయేదీ అదే— నీకు 'ఎమ్సెట్'లో ఫస్ట్ర్యాంక్ వచ్చింది, ఆ విధంగా నువ్వు పాపులర్ అయ్యావు — నెక్స్ట్ ఇయర్ ఎంట్రన్స్ రాయబోయే కొన్ని లక్షలమంది విద్యార్థులకి నువ్వే ఆదర్శం

అందుకే నువ్వు ''నేను ఫలానా గైడ్ చదవడం వలన ఫస్ట్ ర్యాంక్ సాధించానవో— ఫలానా కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకోవడంవలన నన్ను విజయం వరించిందనో' నువ్వు అడ్వర్టైజ్మెంట్ ఇస్తే చాలు—

వచ్చే ఏడు ఆ కోచింగ్ సెంటర్కి, గైడ్లకీ ఎగబడ్తారు జనం'' చెప్పింది షాలిని.

'కానీ— నేను ఆ కోచింగ్ సెంటర్లో చేరడం— గైడ్ కొనడం అబద్ధం కదా?' అనుమానంగా అడిగింది ప్రతిభ.

'అయ్యో.. ప్రతిభా!

ఒక సినిమాస్టారు తను ఫలానా సబ్బు వాడటంవలనే అందంగా ఉన్నానని ప్రకటిస్తుంది అడ్వర్టయిజ్మెంట్లో— అది నిజమేకానక్కర్లేదు.

అక్కడ సినిమాస్టారు అందమే నిజం— ఆ సబ్బు అబద్ధం— అయినా క్రేజ్ క్రేజే!' నచ్చజెప్పింది షాలిని—

ఆటో ఆగింది అది 'ఏటు జెడ్' కోచింగ్ సెంటర్!

షాలిని అందులోకి తీసుకెళ్ళింది ప్రతిభని. ప్రతిభని బయటకూర్చోపెట్టి తను లోపలికి వెళ్ళి డైరెక్టర్తో మాట్లాడింది—

షాలిని చెప్పింది విని మొదట ఆ అకాడమీ డైరెక్టర్ ఆశ్చర్యపోయాడు. తర్వా

న ఆలోచనలో పడ్డాడు— ప్రతిభవల్లన తమ ఇన్‌స్టిట్యూట్‌కి పేరొస్తుందంటే ఆనందంగా ఒప్పుకున్నాడు.

ఆయనే తనకి తెల్సున్న పబ్లిషర్‌కి ఫోన్‌చేసి విషయం చెప్పి అప్పటికప్పుడు రప్పించాడు— ఇద్దరూ కలిసి బేరం కుదుర్చుకున్నారు—

ప్రతిభ ఫోటోలవి తీసుకున్నారు.

అక్కడి పని ముగించుకుని ఇద్దరూ బైటికొచ్చి ఆటో ఎక్కారు— చేతినిండా డబ్బుతో. ఆ డబ్బు ప్రతిభకి ఇంటర్వ్యూకి హైదరాబాద్ వెళ్ళి రావడానికి, కాలేజీలో జాయినింగ్ ఫీజ్ కట్టడానికి పోగా ఇంకా మిగులుతుంది—

'నీకు మంచి పార్టీ ఇస్తాను ఆ మిగిలిన డబ్బుతో' కృతజ్ఞతగా అంది ప్రతిభ షాలినితో—

'థ్యాంక్యూ' చెప్పింది షాలిని.

'సో— ఇంక నువ్వు ఏ బెంగా లేకుండా మెడిసన్‌లోచేరి పెద్ద డాక్టర్‌వైపోవచ్చున్నమాట ఏదీ ఒక్కసారి ఆనందగా నవ్వు'

ప్రతిభకికూడా రిలీఫ్‌గా ఉండటంతో హాయిగా నవ్వేసింది.

'అబ్బ... నవ్వితే ఎంత బావున్నావో నువ్వు! నిన్నిలా ఫొటో తీస్తే టూత్‌పేస్ట్ అడ్వర్‌టైజ్‌మెంట్‌కి సరిగ్గా సరిపోతుంది' అంది షాలిని.

'మళ్ళీ మోడలింగా!' కళ్ళు పెద్దవి చేసింది ప్రతిభ.

షాలిని. ఫకాలున నవ్వేసింది, ప్రతిభకూడా శృతి కలిపింది.




# గుడిలో మెల్ల...

ప్రపంచంలో అత్యంత ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న దేశం స్విట్జర్లాండ్. అక్కడి దేశ ప్రజల తలసరి ఆదాయం 30,270 డాలర్లు. తర్వాత స్థానాన్ని 23,730 డాలర్లతో జపాన్ ఆక్రమించగా, నార్వే, స్వీడన్, అమెరికాలు సుమారు 21 వేల డాలర్లతో వెనుకబడి ఉన్నాయి.

మనదేశం ఈ విషయంలో చాలా వెనుకబడి ఉంది! మన ప్రజల తలసరి సంవత్సర ఆదాయం 350 డాలర్లు మాత్రమే! అయితే మనం సంతోషించాల్సిన విషయం ఏమిటంటే 120 డాలర్లతో టాంజానియా, ఇథియోపియాలు అత్యంత అల్ప తలసరి ఆదాయాల్ని కలిగి ఉండటం! మన దేశంలోని రాజకీయ వ్యవస్థలో పాతుకుపోయిన అవినీతి మాయమైతేనే తప్ప... మనం ఈ విషయంలో అభివృద్ధి సాధించలేం!

—జూపిటర్